నారీభేరి మాసపత్రిక సంక్రాంతి కథల పోటీలో ఉత్తమ కథగా బహుమతి పొందినది

# యోధ

**యూ**నిఫాం ధరిస్తూ అద్దంలోకి చూసుకున్నాను. రక్షణ కవచ ధారిని అయినట్టుగా ఉంది.

ఇంత దాకా సీతని. ఇప్పుడు ఫైర్ ఫైటర్ని.

అమ్మ నా వంక భయం భయంగా చూస్తూ నిలబడింది.

ఆమె భయాన్ని చూసి చిన్నగా నవ్వేను.

"నవ్వుతావేంటే తల్లీ. నువ్వా డ్రెస్ వేసుకుంటే యుద్ధానికి వెళ్తున్నట్టుగానే ఉంటుంది నాకు. నువ్వు తిరిగొచ్చేదాకా మనసు మనసులో ఉండదనుకో..."

"మా వృత్తి జీవితంలో ప్రతి రోజూ ఓ యుద్ధమేనమ్మా" అని నవ్వి అన్నాను. "అమ్మా! ఝాన్సీ అని నువ్వు పేరు పెట్టుకుని నీ కూతురికి పిరికిపాలు పోస్తావేంటి?"

"పేరుకేముంది లేవే. గాంధీ అని పెట్టుకున్న వాళ్ళంతా సత్యమూర్తులూ శాంతమూర్తులూ అయిపోతారా ఏవిటి!"

అమ్మ రెండు భుజాల మీదా చేతులేసి, "మా అమ్మ మాత్రం ఝాన్సీ మాత, జిజియా భాయి అవుతుంది" అన్నాను.

"మాటల్తో మంత్రం వేస్తావు. అంతేగాని నా మాట వినవు. అందరు అమ్మాయిల్లా కంప్యూటర్ ఉద్యోగమో, టీచరు ఉద్యోగమో చూసుకోవచ్చు కదుటే"

"రోజూ డ్యూటీ కెళ్ళే ముందు నువ్వా ప్రశ్న వేస్తావు. మంటలార్పడం నాకిష్టమని నేను చెబుతాను. అయినా మళ్ళీ మళ్ళీ అదే ప్రశ్న, అదే జవాబు...!"

"అది కాదే. పెళ్లి కావాల్సిన పిల్లవి. మగదిక్కులేని సంసారం..."

"ఇంకోసారలా మాట్లాడకమ్మా. చిన్నప్పుడే నాన్న చనిపోతే నన్నింత దాన్ని చేసింది నువ్వే కదమ్మా. తండ్రి తల్లి కాలేకపోవచ్చు. గాని, తల్లి తండ్రి కూడా అవ్వగలదని నువ్వు ఋజువు చేశావమ్మా"

"ఇలాంటి మాటలు వినడానికి బాగానే ఉంటాయి. నిన్ను చూడటానికొచ్చే అబ్బాయిలు నువ్వు ఫైర్ స్టేషన్లో పనిచేస్తావని తెలిసి వెనక్కి చూడకుండా పారిపోతున్నారు. ఎంతకని వేగను చెప్పు!"

అమ్మ కళ్ళల్లోని నిస్సహాయత నా కళ్ళల్లో కన్నీటి పొరని కదిలించింది.

"వాళ్ళు పిరికి వాళ్ళమ్మా. ఈ వృత్తిని తట్టుకోలేని వాళ్ళు రేపు బతుకు పోరాటాన్ని ఎలా ఎదుర్కోగలరు. వాళ్ళు నీ కూతురికి సరిజోడు కారమ్మా. నువ్వు కన్న ఈ ఆడబిడ్డ మంటలకి భయపడదు. మంటలే నీ బిడ్డని చూసి తోక ముడుస్తాయి" గర్వంగా అన్నాను.

"మంటల వూసు వింటేనే గుండెల్లో గంటలు గణ గణ మ్రోగుతాయే తల్లీ" నీరసంగా మంచం మీద చతికిల బడుతూ అంది.

"మంటలు ఎక్కడుంటే అక్కడుండాలని మాకు ట్రెయినింగులో చెప్పారు. నువ్వేమో ఆ మాట వినటానికే భయపడిపోతున్నావ్"

"నాది కన్న కడుపే. నా మాట కాస్త వినవే సీతా. ఎక్కడైనా కొంపలంటుకుపోతే తగుదునమ్మా అని ముందుకెళ్ళకు. మగాళ్ళని ముందుకెళ్ళనిచ్చి నువ్వు వెనకాల ఉండు. నీటి గొట్టాలు పట్టుకునో, అలాటిది ఇంకోటో చేసి నాటకమాడెయ్యి. మంటల్నుంచి తప్పించుకో. పొరబాటున నీ మొహం కాలితే...!" ఆ పైన మాట్లాడలేక అరచేతుల్లో ముఖం దాచుకుని ఏడ్వసాగింది అమ్మ.

"అమ్మా! అందరి తల్లులూ నీలా ఆలోచిస్తే ఇక మంటల్లో చిక్కుకున్న వారికి రక్షణ ఎక్కడ్నుంచొస్తుందమ్మా? వాళ్ళ తల్లులవీ కన్న కడుపులే కదమ్మా" అమ్మ కళ్ళు తుడుస్తూ అన్నాను.

"కాలికేస్తే, వేలికేస్తావ్ వేలికేస్తే కాలికేస్తావ్" నా చేతుల్ని తోసేస్తూ అంది.

"నేనెలాంటి పరిస్థితుల్లో పుట్టానో ఒక్కసారి గుర్తు చేసుకోమ్మా..." షూ వేసుకుంటూ అన్నాను.

అమ్మ నా వంక వెర్రిగా చూసింది.

"ఆసుపత్రిలో పురుటి నొప్పుల్తో నువ్వు సతమతమవుతున్నప్పుడు ఏం జరిగిందమ్మా?" గతాన్ని గుర్తు చేయడానికి అడిగాను.

"అప్పటికి రెండు గంటల్నుంచి నొప్పులు వస్తున్నాయి. డాక్టరమ్మా నర్సులూ క్రిందా మీదా అయిపోతున్నారు. గట్టిగా ముక్కు ముక్కు అని అరుస్తున్నారు. ఇంతలో ఆసుపత్రికి నిప్పంటుకుంది. మంటలు చెలరేగాయి. అంతా పారిపోయారు. కెవ్వుమని బిగ్గరగా అరిచాను. నువ్వు నేల మీద పడ్డావు. ఆ వెంటనే నాకు స్పృహ తప్పింది. ఎవరో పుణ్యాత్ముడు దేవుళ్ళా వచ్చాడు. నిన్నూ నన్నూ  మంటల్లోంచి బయటపడేశాడు" ట్రాన్స్‌లో ఉన్నట్టు చెప్పింది.

"ఆ దేవుడే నాలోనూ ఉన్నాడనుకోమ్మా, భయాలు నీ దగ్గరకి రావడానికే భయపడతాయి"

బై చెప్పి బైక్ మీద మా అగ్నిమాపక కేంద్రానికెళ్ళాను. హాజరు పట్టీలో సంతకం

పెట్టి మా అధికారి అనంతంగార్ని విష్ చేశాను.

"హూఁ హూఁ. ఎండలు మండిపోతున్నాయి. ఏ క్షణంలోనైనా ఏమైనా జరగొచ్చు. బీ అలర్ట్" సిబ్బందిని ఉద్దేశించి అన్నారాయన.

అందరం ఎప్పుడూ షూల్లో కాళ్ళు పెట్టుకుని ఎవర్రెడీగా ఉంటాం. ఉండాలి. అది మా ఉద్యోగ బాధ్యత. అయినా రోజూ ఆయన అలా హెచ్చరిస్తూనే ఉంటారు. ఉత్సాహపరుస్తూనే ఉంటారు.

"మన అవసరం ఎక్కడా ఎవరికీ రాకూడదని ప్రతిరోజూ దేవుణ్ణి ప్రార్థిస్తాను సార్. వస్తే ముందుగా నన్ను పంపమని కోరు కుంటాన్సార్"

నా వంక అభినందన పూర్వకంగా చూశారు అనంతంగారు.

"నిన్ను చూస్తుంటే ముచ్చటేస్తుందమ్మాయ్. ఇది ఆషామాషీ ఉద్యోగం కాదు. ఇందులో పనిచేయడం అంత తేలికా కాదు. బరువులు ఎత్తాలి. పరుగులు తీయాలి. నిప్పుతో చెలగాటమాడాలి. ప్రాణాలకి తెగించాలి. కుసుమ కోమలిలాంటి నువ్వు ఈ డిపార్ట్‌మెంట్ ఉద్యోగానికి రావడం పెద్ద చిత్రం!"

"అతివలు సాధించలేనిదీ సాహసించలేనిదీ ఈ భూమ్మీద ఏదీ లేదు సార్" చిన్నగా నవ్వుతూ అన్నాను.

"మన సీత ఉక్కు సీత సార్..." అన్నాడు కొలీగ్ వెంకట్రావు.

"మన ఉద్యోగం ఉపాధి మాత్రమే కాదు. ఒక ఉక్కు నిబద్ధత. ఒక త్యాగం. ఒక అర్పణ. అవునూ– అసలు నీకెన్నో అవకాశాలూ మహిళా రిజర్వేషన్లూ ఉండగా ఇందులో ఎందుకు చేరాలన్పించిందమ్మా" మా అధికారి అడిగారు.

"చిన్నప్పట్నుంచీ నాలో దీని మీద ఏదో తెలీని ఆసక్తి, ఆకర్షణ ఉన్నాయి సార్. ఫైర్ ఇంజిన్ గంటల చప్పుడు విన్పిస్తే చాలు ఎక్కడున్నాసరే పరుగు పరుగున వెళ్ళేదాన్ని. ఇంజిన్ వెంట పరుగెత్తే దాన్ని. మంటలార్పడాన్ని ఆరాధనగా చూసే దాన్ని, చూస్తూ నిలబడకుండా చేతనైన సాయం చేసేదాన్ని"

నా వంక అభిమానంగా చూస్తూ భుజం తట్టారు. "నీ వల్ల ఎన్నో ప్రాణాలూ ఆస్తులూ రక్షింపబడాలని నీ నుదుటు ఆ దేవుడు రాసి ఉంటాడు. కీపిటప్. కీప్ ది స్పిరిట్..."

"ఓకే సార్. థాంక్యూ సార్" సెల్యూట్ చేశాను.

మరి రెండు గంటలకి హోటల్ వెల్కంమీద తీవ్రవాదులు దాడి చేశారనీ, బాంబులు వేశారనీ, మంటలు చెలరేగాయనీ ఫోన్ వచ్చింది. అప్రమత్తమయ్యాం.

రెండే రెండు నిమిషాల్లో మా ఫైర్ స్టేషన్లోని మూడు ఫైరింజన్లూ స్టార్టయ్యాయి. నేనొక ఇంజిన్‌కి ఇంచార్జిని.

ఆ హొటల్‌నీ పరిసరాలనీ గుర్తు చేసుకున్నాను. దగ్గర్లోని నీటి సోర్సెస్‌ని అంచనా వేశాను. టెర్రరిస్టుల ఎత్తుగడల గురించీ ఆలోచించాను.

అది 13 అంతస్తుల భవనం. అగ్ని ఎలా ఏం అంతస్తులో అంటుకుందో తెలీదు. కరెంటు షార్ట్ సర్క్యూట్ అయినా అయి ఉండొచ్చు.

సైరన్ మోగిస్తూ పది నిమిషాల్లో ప్రమాద స్థలికి వెళ్ళాం.

మేం ఊహించిన దానికన్నా పరిస్థితి భయానకంగా ఉంది. హొటల్ ద్వారం నుంచి పైదాకా అగ్నికీలలు వ్యాపించి ఉన్నాయి. హొటల్లోని కొంత భాగం కూలిపోయింది. హొటల్లో వివిధ అంతస్తుల్లో చిక్కుకున్న జనం హాహా కారాలు చేస్తున్నారు. తీవ్రవాదు లెక్కడ దాగి ఉన్నారో తెలీదు. హొటల్ని పోలీసు బలగాలు చుట్టు ముట్టాయి.

"ఇది టెర్రరిస్టుల ఘాతుకం. బాంబులు పేల్చారు. వాళ్ళలో కొందరు తప్పించుకుపోగా కొందరింకా లోపలే ఉన్నారు. వారి దగ్గర తుపాకులున్నాయి. చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి" అనంతంగారు కాషన్ చేశారు.

ఆయన మాటలేం బుర్ర కెక్కలేదు. మంటల్ని ఆర్పాలి. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరక్కుండా చూడాలి. అంతే!

"ఒక్క గంట టైమివ్వండి సార్ మా తడాఖా చూపిస్తాం..." రంగంలోకి దిగిపోతూ అన్నాం.

గబగబా పైప్స్ లాగి దగ్గర్లోని వాటర్ ట్యాంకులకీ నూతులకీ కనెక్ట్ చేసే పనిలో పడ్డాం.

లోపల్నుంచి దుండగులు, బయటి నుంచి పోలీసులు కాల్పులు జరుపుతున్నారు. ప్రత్యక్షంగా తలపడలేని స్థితి.

ప్రవేశమార్గంలోని మంటల్ని అదుపులోకి తెస్తేగాని వాళ్ళు లోపలికెళ్ళి దుండగులతో ముఖాముఖి తలపడలేరు. లోపలున్న యాత్రికుల్ని రక్షించలేరు.

మంటల్నీ పొగనీ లెక్కచేయకుండా నీటి గొట్టాలతో ఎంట్రన్స్ దగ్గరకి దూసుకుపోయాను.

లోపల్నుంచి తుపాకి గుళ్ళు దూసుకొస్తున్నాయ్. దుండగలు మంటల్ని సైతం లక్ష్య పెట్టకుండా ఎక్కడ ఎలా దాక్కుని కాల్పులు జరుపుతున్నారో మరి!

"సీతా! లోపలి కెళ్ళొద్దు. ప్రమాదం!" వెనక నుండి హెచ్చరించారు అనంతంగారు.

ఆ మాటలు పట్టించుకోలేదు. నా దృష్టంతా ప్రవేశ ద్వారాన్ని మూసేసిన మంటల మీదే ఉంది. వాటిని క్లియర్ చేస్తే గాని జవాన్లు లోపలి కెళ్ళి టెర్రరిస్టుల్ని సూటిగా ఎదుర్కోలేరు. వాళ్ళ పని బడితే గాని లోపలున్న జనాన్ని రక్షించడం సాధ్యంకాదు.

"క్విక్...త్వరగా కానివ్వండి..." పోలీసు ఉన్నతాధికారులు నన్ను తొందర పెట్టారు.

పోలీసులు నా వెనుక పొజిషన్లు తీసుకునున్నారు. అలక్ష్యంగా తుపాకులు కాలిస్తే, అవి అమాయకుల్ని బలి తీసుకుంటాయని వారి ఆలోచన. జాగ్రత్త.

ఎలావోలా మంటల్ని క్లియర్ చేసెయ్యాలన్న ఏకైక లక్ష్యంతో ముమ్మందుకి దూసుకెళ్ళాను. నీళ్ళ గొట్టాలతో ఫోర్సుగా నీళ్ళు చిమ్ముతూ చకచకా మంటల్ని ఆర్పసాగాను.

నీటి ధారల వేగం తగ్గింది. అదిరిపడి వెనక్కి చూశాను. మా వాళ్ళు కంగారు పడుతున్నారు. నీటి లభ్యత తక్కువగా ఉందన్నమాట!

మరొక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా అగ్నికీలల్లోంచి లోపలికి దూసుకెళ్ళాను.

"వద్దు వద్దు" "జాగ్రత్త" వెనుక నుంచి మా వాళ్ళు అరుస్తున్నారు.

ఒకటి రెండు బుల్లెట్లు నా ప్రక్కల్నుంచి పెద్ద శబ్దంతో దూసుకుపోయాయి. అయినా వెనుకంజ వెయ్యలేదు. భయం నా దరిదాపులకి రాలేదు. నా ప్రాణాలు అడ్డు పెట్టైనా సరే ప్రాణాపాయంలో ఉన్న వారిని రక్షించాలి! మరుక్షణం ధైర్యం నా నరనరాల్లోకీ వరదలా ప్రవహించింది.

నా ప్రయత్నం ఫలించింది. దగ్గర్నుంచి నీరు చిమ్మడంతో వేగంగానే మంటలార్పి మార్గాన్ని క్లియర్ చేసేశాను. మరుక్షణం పోలీసు బలగాలు లోపలికి చొచ్చుకెళ్ళాయి.

మొదటి అంతస్తులో కెళ్ళాను. అక్కడంతా దట్టంగా పొగక్రమ్ముకునుంది. ఒక ప్రక్కనింకా మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. రూముల్లోంచి జనం హాహాకారాలు చేస్తున్నారు.

నీటిగొట్టం అందటం లేదు. బలాన్నంతా ఉపయోగించి అటు లాక్కెళ్ళి ఆ మంటల్ని ఆర్పి జనాన్ని జాగ్రత్తగా బయటికి పంపాను.

పై అంతస్తుల్లోని జనం గగ్గోలు పెడుతున్నారు. పోలీసులతో తీవ్రవాదులు దాగుడుమూతలాడుతున్నారు. మధ్య మధ్య ఇరు వర్గాలూ  ఒకరి మీదొకరు కాల్పులు జరుపుతున్నారు. వాటి శబ్దాలతో వారి హెచ్చరికలతో భవనం దద్దరిల్లుతోంది.

దుండగుల దగ్గర బాంబులింకా ఉండి ఉంటాయనీ ఏ క్షణంలోనైనా వాటిని ప్రయోగించవచ్చనీ తెలుసు.

అయినా లెక్కచెయ్యకుండా గోడలకమర్చిన అద్దాలను పగుల గొట్టి లోపలున్న ఫైర్ ఎక్స్టింగ్విషర్స్‌తో దారిలోని మంటల్ని ఆర్పుతూ పై అంతస్తుల్లోకి దూసుకెళ్ళాను. బయట్నించి మా వాళ్ళు నీటి ధారలు కురిపిస్తూ మంటల్ని అదుపులోకి తేవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

లోపలంతా ఉక్కిరి బిక్కిరి చేస్తూ పొగ. చీకటి. కరెంటు లేదు. బాంబు దెబ్బకి కూలిన శిథిలాలు కాళ్ళకి అడ్డం పడుతున్నాయి. వేలాడుతున్న వైర్లు భయ పెడుతున్నాయి. కాళ్ళ క్రింద మనుషులు – కాదు శవాలు – కాల్పుల్లోనో బాంబు పేలుళ్ళోనో  మరణించారు

కాబోలు. గుండె గుభేలు మంది. వారెవరిలోనైనా ఊపిరి ఉందేమోనని పరీక్షించాను. లేదు. దుఃఖం పొంగి వచ్చింది.

ప్రాణాలు అరచేత పట్టుకుని హెూటల్ సిబ్బంది, జనమూ కకావికలుగా పరుగులు తీస్తున్నారు. మా వాళ్ళు నా వెనుక వస్తూ వారికీ క్షతగాత్రులకు సాయపడుతున్నారు,

పిల్లల, ఆడవాళ్ళ రోదనలు తప్ప మరేమీ నాకు విన్పించటం లేదు. చకచకా పై అంతస్తులో కెళ్ళాను.

గబగబా ప్రతి ఫ్లోర్‌లోకీ వెళ్ళి సేఫ్టీడోర్లు తెరిచాను. వెనుక మెట్ల మీంచి దిగి వెళ్ళిపొమ్మని అరిచి చెప్పాను. జనం తోసుకుంటూ సన్నని ఇనుప మెట్ల మీంచి పడుతూ లేస్తూ త్రోసుకుంటూ దిగసాగారు.

13వ అంతస్తులోనూ డోర్ తెరచి, “భయం లేదు, జాగ్రత్తగా వెళ్ళండి…” అరిచాను. అటు వెళ్తూనే కెవ్వుమని అరుస్తూ వెనుక్కొచ్చేశారు.

అటు కూడా మంటలు చెలరేగాయి. మావాళ్ళ కృషి వల్ల మంటలారాయి. కాని ఇనుపమెట్లు కాలిపోతున్నాయి. భవన నిర్మాణానికి కోట్లు ఖర్చు పెడతారు గాని రెండోమార్గం మీద దృష్టి పెట్టరు. చౌకగా అయిపోతుందని ఇనుపమెట్లు అమర్చేస్తారు. అవైనా రెండు మూడు అడుగులు మించి వెడల్పు ఉండదు.

హెూటల్ రూముల్లోంచి దుప్పట్లు లాక్కొచ్చి ఆ మెట్ల మీద వేశాను. అయినా కాళ్ళు కాలుతూనే ఉన్నాయి. కాళ్ళల్లో చేతుల్లో బొబ్బలు లేస్తూనే ఉన్నాయి. మరో దారిలేనందున ప్రాణ భయంతో గబగబా దిగి పోసాగారు జనం.

అన్ని అంతస్తుల్నుంచీ జనం వెనుక మెట్ల నుంచి సురక్షితంగా బయటపడుతూండటం చూసి పొంగిపోయాను.

“నేను అబలను కాదు సబలను’ అనుకున్నాను కించిత్తు గర్వంగా.

నా యూనిఫాం వంక సగర్వంగా చూసుకున్నానో క్షణం. ఉత్తర క్షణాని గదుల్లో బాత్ రూముల్లో ఎవరైనా చిక్కుబడి పోయారేమోనని అరుస్తూ, హెచ్చరిస్తూ క్రింది కొస్తున్నాను.

మూడో అంతస్తులో హఠాత్తుగా చాటు నుంచో దుండగుడు నా మీద కురికి నా పీక చుట్టూ తన చెయ్యి బిగించి కదలకుండా పట్టుకున్నాడు.

అతడి పట్టు విడిపించుకోడానికి విశ్వప్రయత్నం చేశాను గాని సాధ్యం కాలేదు.

‘ఖబడ్దార్!” రివాల్వర్ నా తలకి గురి పెట్టి భీకరంగా గర్జించాడు.

అయినా పెనుగులాడుతోంటే రివాల్వర్ మడమతో నా తల మీద గట్టిగా మోదాడు. కళ్ళల్లోంచి రక్తకన్నీళ్ళు ఉరికాయి.

ఎలాగైనా అతగాడ్ని త్రోసేసి బయటపడాలని యత్నించాను గాని సాధ్యం కాలేదు.

"డ్రాప్ ది గన్స్...ఇసే మారేంగీ..." నన్ను చూపుతూ వికటాట్ట హాసం చేశాడు టెర్రరిస్టు.

ఒకేసారి రెండు వైపుల్నుంచీ చుట్టు ముట్ట బోయిన పోలీసులు అతడికి చిక్కిన నన్ను చూసి ఆగిపోయారు. అతడికి తుపాకులు గురి పెట్టి నిస్సహాయంగా చూస్తూండిపోయారు.

"నేనేమైపోయినా ఫర్లేదు. వీడ్ని వదలొద్దు. చంపెయ్యండి" బిగ్గరగా అరిచాను.

అతడి చేయి నా కంఠం చుట్టూ మరింతగా బిగిసింది. నాకు ఊపిరాట్టం లేదు. అతడి పట్టు విడిపించుకోడానికి ప్రయత్నిస్తోంటే రివాల్వర్ మడమతో మళ్ళీ కొట్టాడు. బహుశా తలమీద గాయమయ్యిందేమో 'మంట' భగ్గుమంది!

రక్తం మెడ మీంచి కారసాగింది.

"ఉస్కో చోడో..." పోలీసులు అరిచారు.

"నహీఁ నహీఁ... ముఝె జానేదో..." వికృతంగా నవ్వుతూ అన్నాడు.

నన్ను కవర్‌గా ఉపయోగించుకుని క్షేమంగా బయటపడాలని అతడి పథకం. అతడి ఆట సాగనివ్వకూడదు. అతడు నన్ను ప్రాణాలతో వదలడన్నది ఖాయం. కాని నా ప్రాణాలు పోయేలోగా అతడి ప్రాణాలు తీయాలి! అతడు ఏ బాంబో విసిరి మరింత విధ్వంసం సృష్టించే అవకాశాన్ని ఇవ్వకూడదు! ఎలా? ఎలా??

వేడి ఆలోచనలతో నా తల పగిలిపోతోంది.

"దారివ్వండి..." పోలీసు అధికారి ఆర్డరేశాడు.

అంతా ప్రక్కలకి తొలిగారు.

విజయహాసం చేస్తూ, "ఛలో" అన్నాడు నన్ను ముందుకు తోస్తూ.

మెల్లగా మెట్లు దిగుతున్నాం. ఎలాగైనా అతడిపై పైచెయ్యి సాధించాలని రకరకాలుగా ఆలోచిస్తున్నాను. అతడేమో త్వరగా హొటల్నుంచి బయటపడి పోలీసు బలగాల్నుంచి తప్పించుకోవాలని ఆత్రుత పడుతూనే అతి జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు.

రెండో అంతస్తులో కొచ్చాం. ఇంకొక్క అంతస్తే ఉంది. క్రిందికెళ్ళిపోతే వాహనం అరేంజ్ చెయ్యమని డిమాండ్ చేసి, దానిలో దర్జాగా తప్పించుకుంటాడు.

అదంతా నన్ను అడ్డు పెట్టుకున్నందు వల్లే సాధ్యమవుతుంది. ఎట్టి పరిస్థితిలోనూ నేనతడి పథకంలో పాచికను కాకూడదు. నేనేమిటో నా తెగువేమిటో చూపించాలి. విచక్షణతో వ్యవహరించి దెబ్బ తీయాలి. నా పోరాటం మృత్యువుతోనే. దాని చేతిలో ఓడినా కర్తవ్యంలో మాత్రం గెలిచి తీరాలి!

అతడ్ని ఆపాలంటే నేను ప్రాణాల మీది ఆశను వదిలేసుకోవాలి. అప్పుడే ఈ తీవ్రవాదిని సజీవంగా బంధించగలుగుతారు. ఇతడూ ఇతడి గ్యాంగూ హొటల్లోని ఎందరు

అమాయకుల్ని పొట్టన బెట్టుకున్నారో! ఏ వీఐపీలని టార్గెట్ చేసుకున్నారో! ఎన్ని బాంబుల్ని పేల్చి హెూటల్ని పాక్షికంగానే అయినా విధ్వంసం చేశారో! భీతావహ పరిస్థితిని కల్పించి జనాన్ని భయభ్రాంతుల్ని చెయ్యడానికి ప్రయత్నించిన వీళ్ళెవరో, వీళ్ళ వెనుక నున్న శక్తులెవరో! అవన్నీ తెలియాలంటే ఇతగాడ్ని నిలువరించాలి. బంధించాలి!

కొన్ని అడుగుల దూరంలో గోడకి అమర్చి ఉన్న ఫైర్ ఎక్స్టింగ్విషర్ కన్పించింది. నా గుండెల్లో ఆనందపు అలలు ఉవ్వెత్తున లేచి పడ్డాయి.

నేను ఫైర్ ఫైటర్ని!

బలాన్నంతా ఉపయోగించి మెరుపు వేగంతో దాన్ని లాగి చేతుల్లోకి తీసుకున్నాను. ఊహించని ఆ ఊపుకి అతడి బ్యాలన్స్ తప్పింది. క్రింద పడ్డాడు. నా మెడ మీది అతడి చేతి పట్టు జారింది.

మరుక్షణంలో ఫైర్ ఎక్స్టింగ్విషర్ని ఓపెన్ చేసి అతడి మీదకి పిచికారీ చేశాను.

అతడు భీకరంగా అరుస్తూ రివాల్వర్ ఎడా పెడా పేల్చాడు. ఒకటి నా భుజంలోంచి, మరోటి నా బుగ్గని చీలుస్తూ దూసుకుపోయింది.

అయినా పట్టించుకోకుండా కాళ్ళతో అతడ్ని తొక్కి పట్టాను.

ఇంతలో నలువైపుల్నుంచీ పోలీసులొచ్చి అతడ్ని అదుపులోకి తీసుకున్నారు.

"అందర్నీ పట్టేశారా?" నా గాయాల్ని లెక్క చెయ్యకుండా ప్రశ్నించాను.

"లేదు. ఇద్దరు కాల్పుల్లో చనిపోయారు. ఒకడు సైనైడు మింగాడు. వీడొక్కడే ప్రాణాలతో దొరికాడు. హేట్సాఫ్ టూ యూ డేర్ డెవిల్...!"

"నా డ్యూటీ నేను చేశాను..." రక్తం స్రవిస్తోన్న భుజాన్ని నొక్కి పడుతూ బాధను పళ్ళ బిగువున భరిస్తూ అన్నాను.

"కాల్ ది అంబులెన్స్..." పోలీసు అధికారి అరిచాడు.

నన్ను అంబులెన్సులోకి ఎక్కిస్తోంటే మా అధికారి అనంతంగారొచ్చి షేక్ హ్యాండిచ్చారు. "బ్రేవో మై చైల్డ్. అలనాటి సీత అగ్ని పునీత. ఈ నాటి మా సీత అగ్నిబావుటా!"

చెమ్మగిల్లిన కళ్ళల్లోంచి గర్వంగా చూస్తోన్న ఆయన వంక చూసి చిన్నగా నవ్వేను! విజేతలా నవ్వేను! యస్. నేను విజేతని!

*   *   *

**(నారీ భేరి–2017)**